పోలీస్ సిబ్బంది కొరత

- రామభద్రపురం పోలీస్ స్టేషన్‌లో తగిన స్థాయిలో లేని సిబ్బంది
- స్టేషన్‌లో పేరుకే 20 మంది సిబ్బంది
- వీరిలో వివిధ విధులకు వెళ్లిపోతున్న 18 మంది
- స్టేషన్‌లో మిగిలింది ఇద్దరే



రామభద్రపురం పోలీస్ స్టేషన్



కొట్టక్కి చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

రామభద్రపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది.మండలంలోని 22 పంచాయతీల్లో సుమారు 52వేల మంది జనాభా ఉన్నారు. జనాభాకు తగ్గట్టు ఇక్కడ సిబ్బంది లేరు. 20మంది మాత్రమే ఉండడడం...వారిలో 18 మందిని వివిధ పనులకు అటాచ్ చేయడంతో శాంతి భద్రతల పరిరక్షణ కత్తిమీద సాములా తయారైంది. ఉన్న 20 మందిలో సర్కిల్, డీఎస్పీ కార్యాలయాలకు ఇద్దరిని చొప్పున నలుగురిని అటాచ్ చేశారు.అలాగే కొట్టక్కి వద్ద ఉన్న చెక్ పోస్టుకు ఇద్దరు, టాస్క్ ఫోర్స్‌కు ఒకరు, సబ్‌జైల్‌కు ఒకరు, విజయవాడ కు ఒకరు విధుల నిర్వహణకు వెళ్లిపోతున్నారు.అలాగే సాలూరు కోర్టు పని నిమిత్తం ఒకరు, సెంట్రీ ఒకరు, రైటర్ ఒకరు, అసిస్టెంట్ రైటర్ ఒకరు, కంప్యూటర్ ఆపరేటర్స్ ఇద్దరు, పెద్దస్థాయి ప్రజాప్రతినిధులు,అధికారులు వచ్చినప్పుడు బందోబస్తుకు ముగ్గురు వెళ్లి పోతున్నారు. ఇక గ్రామాల్లో శాంతి భద్ర తల పరిరక్షణకు మిగిలింది ఎస్ఐతో పాటు మరో ఇద్దరు మాత్రమే. వీరిలో ఎవరో ఒకరు సెలవు పెడితే ఇద్దరే ఉంటున్నారు. మండలంలో ఎక్కడైనా వేర్వేరు ప్రాంతాల్లో ఒకే సమయంలో దొంగతనం జరిగినా,గొడవలు జరుగుతున్నట్టు, మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా జరుగుతున్నట్టు సమాచారం అందినా ఘటనా స్థలాలకు వెళ్లేందుకు తగిన సిబ్బంది లేక ఇబ్బంది ఎదురవుతోందని పోలీసు అధికారులు ఆవేదన చెందుతున్నట్టు సమాచారం.మండల కేంద్రం మీదుగా మాదక ద్రవ్యాలతో పాటు పలు నాసిరకం వస్తువుల అక్రమ రవాణాకు అడ్డూ,అదుపూ లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడికి బోర్డర్‌లో ఉన్న ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి గంజాయి, ఖైనీ గుట్కా, నల్ల మందు వంటి మాదక ద్రవ్యాలతో పాటు నిషేధిత వస్తువులను మండలం మీదుగా అక్రమ రవాణా చేసుకునేందుకు అక్రమార్కులు రాచమార్గంగా భావిస్తున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు..

మండలంలో ఇటీవల ద్విచక్రవాహనంపై గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు రయ్‌మని దూసుకెళుతూ ఎదురుగా వస్తున్న డీఎస్పీ వాహనాన్ని ఢీ కొట్టారు. డీఎస్పీ తన వాహనంలో నుంచి దిగేలోపల కింద పడిపోయిన అక్రమార్కులు పక్కనే ఉన్న పొలాల్లో నుంచి మండల కేంద్రం రామభద్రపురం లోకి వెళ్లిపోయారు. వారిని ఇద్దరు పోలీస్ సిబ్బంది వెంబండించి చీకటి పడినంత వరకు వెతికినా దొరక్కుండా ముచ్చెమటలు పట్టించారు. ఫిబ్రవరి 10వ తేదీ రాత్రి కొట్టక్కి పోలీస్ చెక్ పోస్టు వద్ద సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా...వాహనాల వెనుక ఉన్న ఒడిశా నుంచి వస్తున్న ఓ డస్టర్ కారు డ్రైవర్ పోలీసులను గమనించి కారును జాతీయ రహదారి పక్క నుంచి ఉన్న చిన్న రూట్‌లోకి తిప్పి తప్పించుకుని వెళ్లబోయాడు. పోలీసులు వెంబడించడంతో కారును అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు ఆకారును తనిఖీ చేయగా 150 కిలోల గంజాయి పట్టుబడింది. తగిన సిబ్బంది లేకపోవడం వల్లే నిందితులను పట్టుకోలేకపోతున్నారని ఎక్కువ మంది పోలీసులు ఉంటే వారు ఎక్కడికీ పారిపోలేరని పలువురు అంటున్నారు. ఇటీవల స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రి విధులు నిర్వహిస్తున్న ఓ హెడ్ నర్సుపై పలువురు యువకులు అసభ్యంగా ప్రవర్తించారు.ఆనర్సు ఎస్ఐకు ఫిర్యాదు కూడా చేశారు. అదే ఎక్కువ మంది సిబ్బంది ఉండి రాత్రి వేళల్లో ఆస్పత్రి, ఇతర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కాదు కదా అని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సిబ్బంది కొరత వాస్తవమే..



సిబ్బందికి అదనపు విధులు ఉండడం వల్ల కొంత మేర సిబ్బంది కొరత సమస్య ఉంది. అయినప్పటికీ సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నాం. ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.అలాగే స్థానిక బైపాస్ రోడ్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేశాం. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా మరింత పకడ్బందీగా చర్యలు తీసుకుంటాం.

– వి.ప్రసాదరావు,రామభద్రపురం ఎస్ఐ

క్లుప్తంగా

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ప్రతీ ఒక్కరి ధ్యేయం కావాలని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. స్థానిక అభ్యుదయ స్కూల్‌లో భారతీ య న్యాయ సేవా ఫౌండేషన్ సోమవారం డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్ జోలికి పోబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ విమెన్స్ వింగ్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ చింత శారద, టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారు పాప, నంబియార్ వేణుగోపాలరావు, అభ్యుదయ విద్యాసంస్థల కరస్పాండెంట్ మర్రాపు కూర్మినాయుడు(నానిమాస్టారు) పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే పనికిమాలిన వాళ్లంటారా..?



మువ్వల శ్రీనివాసరావు

బొబ్బిలి: పట్టణంతో పాటు, నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే బేబి నాయన అసహనంతో పనికిమాలిన వాళ్లని అనడం దారుణమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, జిల్లా అధికారప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ పౌరుడు ఈ రోడ్లపై సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారని, వారంతా పనికిమాలిన వాళ్లేనా అని ప్రశ్నించారు.ఆ పనికిమాలిన వాళ్లు ఓటేస్తేనే మీరు గెలిచారని తెలుసుకోవాలన్నారు. ఓపార్టీ ప్రతినిధిగా తాను ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేని బేబీ నాయన పనికిమాలిన వాళ్లనడం మాత్రం సరికాదన్నారు.ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో బొబ్బిలిని ఏలిన వాళ్లెవరూ ఇలా అనలేదన్నారు. ఎమ్మెల్యేగా ఎవరూ శాశ్వతంగా ఉండరని గుర్తెరగాలన్నారు.

అభినందన



డీపీఎం, ఏపీఎం, రాజాం మండల సమాఖ్య సభ్యులను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్

రాజాం: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అందజేసే ఆత్మనిర్భర్ అవార్డుకు మండల మహిళా సమాఖ్య ఎంపిక కావడంతో రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.మంత్రి విజయనగరంలోని తన క్యాంపు ఆఫీస్‌లో రాజాం మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ, సెర్ప్ డీపీఎం ఏ.చిరంజీవి, ఏపీఎం భవానిని సోమవారం సత్కరించారు.

నేడు కోటిపల్లిలో నేత్ర వైద్యశిబిరం

బాడంగి: జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో కోటిపల్లి గ్రామంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్యాంప్ జూనియర్ మేనేజర్ సీహెచ్. వెంకటరమణ సోమవారం తెలిపారు. కోటిపల్లి, పరిసర గ్రామాల ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే

- టీడీపీ కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- జగన్‌కు పెరుగుతున్న జనాదరణ
- జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్‌శ్రీనివాసరావు

రామభద్రపురం: ప్రతీ ఎన్నికల్లో వందల హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడుకు అలవాటుగా మారిపోయిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు.స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికా రంలోకి వచ్చి ఏడాది అయిపోయిందని, ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు వందల హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయకుండా చంద్రబాబు కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రజలకు వెన్నుపోటు పొడవడం ఆయన కు వెన్నతోపెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఏడాదికే చంద్రబాబు పాలనపై ప్రజలు విసిగెత్తిపోయారని, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు వస్తున్న జనాదరణ చూసి కూటమి నాయకులు తట్టుకోలేక పోతున్నారన్నారు. ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తున్న క్రమంలోనే ఒకట్రెండు పథకాలను అరకొరగా ఇచ్చారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ వైఎస్సార్‌సీపీ నాయకుడు,కార్యకర్తపై ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని గుర్తుచేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ఏదో చేసేశామని చెప్పి మభ్యపెట్టేందుకు 'సుపరిపాలన లో తొలిఅడుగు' కార్యక్రమం పేరిట ఇంటింటికీ వస్తున్న టీడీపీ నేతలను నిలదీయాలని ప్రజలకు సూచించారు. ఈనెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, రామభద్రపురం పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం రేపు



నాయకులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం ఈనెల 9న నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. బొబ్బిలి పట్టణ, రామభద్రపురం, బాడంగి, తెర్లాం, బొబ్బిలి మండలాల నాయకులతో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని శ్రీ సూర్యరెసిడెన్సీలోబుధవారం ఉదయం 9 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి కిల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు హాజరై నియోజకవర్గంలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' అనే కార్యక్రమం నిర్వహణపై దిశానిర్దేశం చేస్తారన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, బొబ్బిలి మండల అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదరరావు, పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వర రావు(విసు),మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీ కృష్ణారావు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని బొబ్బిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. రామభద్రపురం,బాడంగి,తెర్లాం మండల నాయకులు,కార్యకర్తలు ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో వేడుకలు నిర్వహించాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలచేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రాజాం సిటీ: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదలచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీగా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడు తూ ఆరు త్రైమాసికాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4,200 కోట్లు, హాస్టల్ మెయింటెనెన్స్ చార్జీలు రూ.2,200కోట్లు బకాయి ఉందని వివరించారు. విద్యారంగానికి సంబంధించి యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఎన్నో హామీలు ఇచ్చారని, విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. బకాయిల విడుదలతో పాటు జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని, లేకుంటే ఈనెల 11న కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీటీ ప్రకాష్‌కు మెమోరాండం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.ప్రవీణ్, పట్టణ నాయకులు జయరామ్, రాము, రామకృష్ణ, ప్రవీణ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం 1130 దరఖాస్తులు

రామభద్రపురం: మండలంలో ఇళ్ల స్థలాల కోసం 1130 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయని తహసీల్దార్ అజు రఫీజాన్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలోమాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల కంటే ఒక్క రామభద్రపురం పంచాయతీ నుంచే 700కు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. గ్రామాల వారీగా వీఆర్‌ఓలతో పరిశీలన చేయించి అర్హులను గుర్తిస్తున్నామన్నారు. అలాగే గ్రామాల వారీగా ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నదీ లేనిది కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ భూమి లేని చోట ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూమి కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. డీటీ గిరిధర్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు



డాక్టర్ రాజేష్

రాజాం: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నామని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవా రం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

9న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

ఈనెల 9వ తేదీన రాజాం పట్టణంలోని శ్రీ సూర్య దుర్గా ఫంక్షన్ హాల్‌లో రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వ హించనున్నామని ఆపార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ తెలిపారు. నియోజకవర్గంలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారం టీ' అనే కార్యక్రమం నిర్వహణపై పార్టీ శ్రేణులకు పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేసేందుకు, పార్టీ కార్యకర్తల సలహాలు తీసుకునేందుకు నిర్వహి స్తున్న ఈసమావేశం బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ పీఏసీ సభ్యు లు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. రాజాం పట్టణంతోపాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మండల స్థాయి పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: ఉంగరాడమెట్ట బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం మండల స్థాయి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డ్రగ్స్‌తో కలిగిన అనార్థలపై నిర్వహించిన పోటీల్లో వివిధ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనంలో లక్ష్మీపురం పాఠశాల విద్యార్థిని బొత్స అలేఖ్య ప్రథమ స్థానం, అంబఖండి పాఠశాల విద్యార్థిని మీసాల వంశీకృష్ణ ద్వితీయ స్థానంలో నిలిచారు. వ్యాసరచనలో ఏ.వి.పురం పాఠశాల విద్యార్థిని కడగల శ్వేత ప్రథమ స్థానం, అంబఖండి పాఠశాల విద్యార్థిని కె. ప్రమీల ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, సీఆర్ఎంటీలు ఆదినారాయణ, చంద్రరావు, మోహనరావు, కృష్ణ పాల్గొన్నారు.

నేడు పీఏఐపై శిక్షణ

బొబ్బిలిరూరల్: పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ)పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎస్ఎంలకు మంగళవారం ఒక్కరోజు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి, పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇస్తారని, ఉదయం 9 గంటలకు పంచాయతీ కార్యదర్శు లు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎస్ఎంలు హాజరు కావాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు సరుకులు అందజేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

వంగర: మండలంలోని కొప్పరవలస, బంగారువలస, కె.కొత్తవలస తదితర గ్రామాలకు చెందిన పేదలకు కొప్పరవలసలో సత్యసాయి సేవా సమితి సభ్యులు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తిరుపతికి చెందిన నవజీవన ట్రస్ట్ సహకారంతో ఆధ్వర్యంలో అమృత కలశం పేరుతో నెలరోజులకు సరిపడా సరుకులు అందించామని సత్యసాయిసేవా సమితి భక్తులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



రామభద్రపురం: వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు



రాజాం సిటీ: రాజాంలో కార్మికుల బైక్ ర్యాలీ

బొబ్బిలి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఈనెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ మునకాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సమ్మెకు సంబంధించిన కరపత్రాలను స్థానిక జెండా మహల్ వద్ద కార్మికులతో కలిసి సోమవారం విడుదల చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్కొక్కటిగా తుడిచి పెడుతోందని ఆరోపించారు. అంతర్జాతీయ కార్మిక చట్టాలు, మార్గదర్శకాలను, రాజ్యాంగ స్ఫూర్తిని,సుప్రీం కోర్టు తీర్పులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని, వీటన్నింటికీ నిరసనగా చేపడుతున్న సమ్మెలో ఉద్యోగ, కార్మిక,కర్షక సంఘాలతో పాటు నేరుగా ప్రజలు కూడా పాల్గొనాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

బొబ్బిలి: లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, పట్టణ కలాశీ సంఘం అధ్యక్షుడు బోగాది అప్పలస్వామి సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశా రు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలో తలపెట్టిన నిరసన ప్రదర్శనల్లో రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

గ్రామాల్లో ప్రచారం

బొబ్బిలిరూరల్: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ, రైతు సంఘాల జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, ఎస్.గోపాలం మండలంలోని పక్కి,జె.రంగరాయపురం తదితర గ్రామాల్లో సోమవారం ప్రచారం చేశారు.బొబ్బిలిలో వేణుగోపాల స్వా మి ఆలయం వద్ద నుంచి బుధవారం ఉదయం 10గంటలకు నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు.

బైక్ ర్యాలీ

రాజాం సిటీ: దేశ వ్యాప్త సమ్మెను అన్ని రంగాలకు చెందిన కార్మిక వర్గాలు విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్. రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో సోమవారం రాజాం ప్రధాన రహదారిపై కార్మిక సంఘాలతో కలిసి సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పనిగంటల పెంపును ఏకపక్షంగా ఆమోదించడం, రాత్రి సమయాల్లో మహిళలకు డ్యూటీ మినహాయింపును రద్దుచేయడం కక్షపూరిత చర్యలేనని మండిపడ్డారు. కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

వంగర: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వీఓఏలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వీఆర్ఏలు, పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కన్వీనర్ వై.అప్పలస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్య కర్తలు, తదితరులతో సోమవారం సమావేశం నిర్వహించి, ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయా లని కోరారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

రామభద్రపురం: డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించి, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే మోటారు వాహన చట్టం- 2021, భారత న్యాయ సంహిత 106(1)(2) చట్టసవరణను, ఇతర కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాకి సురేష్ డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ నాయకులు బలస శ్రీనివాసరావు, మోటారు వాహన కార్మికులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. రవాణా, ఇతర రంగాల్లోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలునిచ్చారు. ఆటో యూనియన్ నాయకులు బారికి గంగరాజు,రాంబార్కి రామకృష్ణ,శ్రీను,సవరాల అప్పారావు,దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

అన్నదానం

బొబ్బిలి: పట్టణానికి చెందిన నేను సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ప్రతీ సోమవారం నిర్వహించే ఈఅన్నదాన కార్యక్రమం 403వ వారానికి చేరిందని సంస్థ అధ్యక్షుడు బొంగు గౌరీ సంతోష్ కుమార్ తెలిపా రు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్షమాగుణం కలిగి ఉండాలి

బొబ్బిలి: సమాజంలో ప్రతి ఒక్కరూ క్షమాగుణాన్ని కలిగి ఉండాలని కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జేసీ రాజు అన్నారు. సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రపంచ క్షమాపణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పగ, ప్రతీకారాల పీచమణచి శాంతికి బాటలు వేసేందుకు క్షమాగుణం ఒక్కటే మార్గమన్నారు. సభ్యులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, యుగంధర్, శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన

రాజాం: మండలంలోని కొఠారిపురం, బొద్దాం తదితర గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీలను(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు) ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. కేంద్రంలో తడి, పొడి చెత్తను వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించి క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

ఎరువుల పంపిణీ

బొబ్బిలిరూరల్: మండలంలోని ఎం.బూర్జివలస, అలజంగి, పక్కి గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో రైతులకు వీఏఏలు సోమవారం యూరియా,డీఏపీ ఎరువులను పంపిణీ చేశారు.గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో ఎరువుల పంపిణీ ప్రక్రియ ప్రారంభించామని, రైతులందరికీ ఎరువులు అందజేస్తామని ఏడీఏ శ్యామసుందర్ తెలిపారు.

ఖండ్యాం గ్రామానికి బస్సు సర్వీసు ప్రారంభం

రేగిడి: పాలకొండ నుంచి మజ్జి రాముడుపేట గ్రామం మీదుగా మండలంలోని ఖండ్యాం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు సోమవారం ప్రారంభించారు. మజ్జి రాముడుపేట, అప్పాపురం, గోపింపేట , కొమెర, వెంకటాపురం తదితర గ్రామాలను కలుపుతూ రోజు బస్సు సర్వీసులు ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఉదయం పాలకొండ నుంచి ఖండ్యాంకు, రాజాం నుంచి ఖండ్యాంకు, సాయంత్రం 5 గంటలకు రాజాం నుంచి ఖండ్యాంకు, మళ్లీ ఖండ్యాం నుంచి పాలకొండకు ఈ బస్సు సేవలందనున్నాయని చెప్పారు. ఖండ్యాం గ్రామానికి చెందిన ఐఆర్ఎస్ ట్రైనీ ఉద్యోగి బవిరి సంతోష్ కుమార్ తమ గ్రామానికి బస్సు సర్వీసు కావాలని జిల్లా కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేయడంతో, కలెక్టర్ స్పందించి బస్సు సదుపాయం కల్పించారని గ్రామస్తులు తెలిపారు.